క్లుప్తంగా

బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ ప్రతినిధులు

జలుమూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు పూర్తయినా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎటువంటి ప్రయోజనం లేదని, పెండింగ్‌లో ఉన్న డీఏ, సరెండర్ లీవులు, పీఎఫ్ సెటిల్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి డిమాండ్ చేశారు. శనివారం చల్లవానిపేట ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ మండల మహా సభ నిర్వహించారు. డీఎస్సీని వెంటనే ప్రకటించాలని, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని జిల్లా గౌరవ అధ్యక్షుడు కోరాడ వైకుంఠరావు కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.హర్షవర్ధన్, పురుషోత్తమం, ప్రతినిధులు జి.రాము, ఉంగటి అప్పలసూర్యనారాయణ, పైల సూర్యనారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం



చిన్నారికి వైద్య పరీక్షలు చేస్తున్న చిన్న పిల్లల వైద్యురాలు

సారవకోట: శీతాకాలంలో చిన్నారులకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బుడితి సీహెచ్‌సీ చిన్నపిల్లల వైద్యులు చల్లా చైతన్య సూచించారు. శనివారం ఆస్పత్రిలో మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల చిన్నారుల్లో ఆస్తమా, ఉబ్బసం, వైరల్, డెంగీ, టైఫాయిడ్, ఫ్లూ జ్వరాలు వస్తున్నాయన్నారు. చలి గాలిలో ఆరుబయటకు, ఎక్కువ మంది జనాలున్న చోటకు తీసుకెళ్లవద్దన్నారు. శరీరంపై దద్దుర్లు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించి సరైన చికిత్స పొందాలన్నారు. కొంతమంది చిన్నారులకు ఆవు పాలు పడకపోవడంతో తరచూ దగ్గు, జలుబు, విరోచనాలు, వాంతులు, బరువు పెరగకపోవడం వంటి లక్షణాలు కన్పిస్తాయని, అటువంటి వారికి ఆవు పాలు ఇవ్వవొద్దని సూచించారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస: సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ, మున్సిపల్ సిబ్బందితో శనివారం సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో పనులను గుర్తించి అంచనాలను రూపొందించాలని సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీప్రసాద్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రూ.90 లక్షలతో గుంతల పూడ్చివేత పనులు..

ఆమదాలవలస నుంచి పురుషోత్తపురం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలోని గుంతల పూడ్చివేత పనులను రూ.90లక్షల నిధులతో చేపట్టేందుకు ఎమ్మెల్యే రవికుమార్ శనివారం శంకుస్థాపన చేశారు. ఆర్అండ్‌బీ డీఈ గణపతి, జేఈ ఆంజనేయ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం

పాతపట్నం: మండలంలోని బడ్డుమర్రి పంచాయతీ పరిధిలోని కొనంగి గ్రామానికి చెందిన వ్యక్తి 20 లీటర్ల నాటుసారాతో కొనంగి సమీపంలో శనివారం పట్టుబడినట్లు పాతపట్నం ఎక్సైజ్ సీఐ కె.కృష్ణారావు అన్నారు. సారాను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు. 14 రోజులు రిమాండ్‌కు పంపామన్నారు. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం ధరల పట్టికను దుకాణాల ముందు తప్పనిసరిగా ఉంచాలని, గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని హెచ్చరించారు. బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసే దుకాణాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

భూగర్భ జలాలు పెరిగేందుకు చర్యలు

నరసన్నపేట: భూగర్భ జలాలు గరిష్ట స్థాయికి పెంపొందించేందుకు అవసరమైన పనులు గుర్తించాలని డ్వామా పీడీ బి.సుధాకరరావు అన్నారు. తామరాపల్లిలో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ (ఇంటి పైకప్పు నుంచి జారిపడే నీటిని భూగర్భంలోకి ఇంకించడం) పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, మండల జేఈ, ఫీల్డ్ అసిస్టెంట్‌కు పలు సూచనలు చేశారు. భూగర్భంలో నీటి మట్టం బాగా తగ్గిపోతుందని, ఇప్పటినుంచే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షం నీరు ఇంకింపజేసే పద్ధతులపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. భావితరాలకు నీటి కొరత లేకుండా ఉండాలంటే ప్రజలు వర్షం నీటిని భూమిలో ఇంకింపజేసే పనులు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పనుల నిర్వహణ తీరుపై ఆరా తీశారు. పనులు వెంటనే ప్రారంభించాలని సిబ్బందికి సూచించారు. ఏపీఓ యుగంధర్, మండల జేఈ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వరి పంట పండింది!



గోపాలపెంట వద్ద ఆశాజనకంగా ఉన్న వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

- నరాసరిన 30 బస్తాలపైనే దిగుబడి వస్తుందని అంచనా
- చెన్నయ్యవలసలో 36 బస్తాల దిగుబడి
- సారవకోటలో ముమ్మరంగా వరి కోతలు

నియోజకవర్గంలో మండలాల వారీగా వరి పంట విస్తీర్ణం (ఎకరాల్లో), పంట కోత ప్రయోగాల సంఖ్య వివరాలు

మండలం	విస్తీర్ణం	పంటకోత ప్రయోగాల సంఖ్య
నరసన్నపేట	17,193	132
పోలాకి	17,627	136
జలుమూరు	19,464	140
సారవకోట	15,996	104

నరసన్నపేట: ప్రకృతి కరుణించింది. ప్రభుత్వం ఒకవైపు రైతులకు ఆర్థికంగా ఆదుకోకపోయినా.. ఎరువుల సరఫరాలో చేతులెత్తేసినా.. వాతావరణం అనుకూలించడంతో ఈ ఖరీఫ్‌లో వరి పంట ఆశాజనకంగా ఉంది. మంచి దిగుబడి వచ్చే సూచనలే కనిపిస్తున్నాయి. దానా తుఫాన్ ప్రభావం జిల్లాపై ఉంటుందని రైతులు, వ్యవసాయాధికారులు భయపడ్డారు. ఈ తుఫాన్ ఒడిశా వైపునకు మళ్లడంతో ముప్పు తప్పింది. వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం తుఫాన్లు లేవని తెలుస్తోంది. జలుమూరు మండలం చెన్నయ్యవలసలో దువ్వారపు లక్ష్మీనారాయణ పొలంలో శుక్రవారం పంట కోత ప్రయోగం చేపట్టారు. దీంట్లో 36 బస్తాలు (80 కేజీలు) దిగుబడి వస్తుందని అంచనా కట్టారు. సరాసరిన 33 బస్తాలు దిగుబడి వస్తుందని భావిస్తున్నారు. గత సీజన్‌లో కూడా 30 బస్తాలపైనే దిగుబడి వచ్చింది. కాలువల ద్వారా నీరు సక్రమంగా అందకపోయినా.. బోర్లు, ఇతర సదుపాయాల ద్వారా రైతులు పంటలకు నీటి తడులు పెట్టారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని సారవకోట మండలంలో కోతలు చురుగ్గా చేపడుతున్నారు. జలుమూరు మండలంలో కూడా వరి కోతలు ప్రారంభమయ్యాయి. నరసన్నపేట, పోలాకి మండలాల్లో ఈ నెలాఖరు నాటికి కోతలు ప్రారంభం కానున్నాయి. రైతులు ఈ మేరకు యంత్ర పరికరాలను సిద్ధం చేసుకుంటున్నారు. కోత, నూర్పుడి యంత్రాలు కూడా అందుబాటులోన్నాయి.

వరి రకాలు..

నియోజకవర్గంలో రైతులు ఈ సీజన్‌లో పలు వరి రకాలను సాగు చేశారు. స్వర్ణ, సాంబమసూరి, ఎంటీయూ 1224, ఎంటీయూ 1061, ఎంటీయూ 1064, ఎంటీయూ 1318 రకాలతోపాటు ప్రైవేట్ రకాలైన సిరి, అమూల్య, సంపద స్వర్ణ వంటి రకాలను రైతులు అధికంగా వేశారు.



చెన్నయ్యవలసలో పంటకోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

సరాసరి దిగుబడి 32 బస్తాలు రావచ్చు



నియోజకవర్గంలో వరి పంట ఈ సీజన్‌లో అనుకూలంగా ఉంది. మంచి దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాం. సరాసరిన 32 బస్తాలు రావచ్చని అంచనా వేస్తున్నాం. సన్న రకాలు బాగా పండాయి. మరో నెల రోజులు వాతావరణం సహకరిస్తే రైతులు గట్టెక్కినట్లే.

– రవీంద్రభారతి, వ్యవసాయశాఖ ఏడీ, నరసన్నపేట

ఖర్చులు పెరిగాయి.



ఉర్లాం ప్రాంతంలో కొన్ని ప్రాంతాల్లో దోమ ప్రభావం ఉంది. ఆ ప్రాంతంలో దిగుబడి కొంత తక్కువగా వచ్చే అకాశాలున్నాయి. మిగిలిన ప్రాంతాల్లో పంట బాగుంది. అధికారుల అంచనాల తగ్గట్టుగా దిగుబడి రావచ్చు. రైతులకు ఖర్చులు మాత్రం బాగా పెరిగాయి.

– పోలాకి నర్సింహమూర్తి, రైతు, ఉర్లాం

ప్రభుత్వం సామాన్యుల నడ్డి విరుస్తోంది



ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: అబద్ధపు హామీలతో అధికారానికి వచ్చిన కూటమి ప్రభుత్వం అధిక ధరలతో సామాన్యుల నడ్డి విరుస్తోందని, 120 రోజుల్లో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశానికి ఎగబాకాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పప్పులు, ఆయిల్‌తో పాటు నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. విద్యుత్ బిల్లుల ధరలు పెంచారని అన్నారు. అలాగే కూటమి ప్రభుత్వ ఏర్పాడ్డాక ముఖ్యమంత్రి హోదాలో జిల్లాకు వచ్చిన చంద్రబాబు వల్ల ఏమీ ఒరగలేదన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జిల్లాకు పోర్టు, కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఉద్దానం రక్షిత మంచి నీటి పథకం, ఫిషింగ్ హార్బర్‌లు మంజూరు చేశారని గుర్తు చేశారు.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన



వంశధార నదిలో జేసీబీలతో ట్రాక్టర్లకు లోడింగ్ చేస్తున్న దృశ్యం



గ్రామం ప్రారంభంలో ఇసుకను డంపింగ్ చేస్తున్న దృశ్యం

నరసన్నపేట: గోపాలపెంట వద్ద వంశధార నదిలో ఇసుక తవ్వకాలు ఇష్టానుసారంగా జరుగుతున్నాయి. నదిలో యంత్రాలు వినియోగించకూడదని నిబంధనలున్నా ర్యాంపు నిర్వాహకులు జేసీబీలను వినియోగించి పనులు చేపడుతున్నారు. నది గర్భంలో ఎక్కడికక్కడ గోతులు పెట్టి ఇసుకను తవ్వుతున్నారు. ట్రాక్టర్లతో గ్రామ ప్రారంభంలో డంపింగ్ యార్డుకు ఇసుకను తరలించి అక్కడ నుంచి లారీల్లో తీసుకెళ్తున్నారు. సాక్షాత్తు కలెక్టర్ వచ్చి ఇక్కడ ఇసుక ర్యాంపును ఓపెన్ చేశారు. కానీ ఇక్కడే యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఆన్‌లైన్‌లో డీడీలు తీసుకుని లారీలు వస్తుంటే ఇసుకను లోడింగ్ చేయిస్తున్నామని, స్థానిక సచివాలయ వీఆర్వో ఉమాదేవి, డిజిటల్ అసిస్టెంట్ సాయిలక్ష్మి తెలిపారు. పగలు 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ర్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోజుకు పది లారీల వరకు అధికారికంగా ఇసుకను లోడ్ చేస్తున్నామన్నారు. పగలు కంటే రాత్రి సమయాల్లో ఇసుక లోడింగ్ అధికంగా జరుగుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రాత్రి సమయాల్లో సిబ్బంది ఎవరూ లేనప్పుడు బాగా ఇసుక తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై తహసీల్దార్ సత్యనారాయణ స్పందిస్తూ గోపాలపెంట ర్యాంపునకు మార్చి వరకు అనుమతులు ఉన్నాయని, సచివాలయ సిబ్బందికి డ్యూటీలు వేశామని, అక్రమ తరలింపు అనేది లేకుండా చూస్తామన్నారు.

భయపెడుతున్నాయ్..




ఈ చిత్రం సరుబుజ్జిలి మండలంలోని పెదమాలపేట గ్రామంలో గుంపుగా సంచరిస్తున్న కుక్కలు. వృద్ధులు, చిన్నారులు రాత్రి వేళ వీధుల్లోకి అడుగుపెట్టాలంటే భయపడుతున్నారు. ఇటీవల పాలవలస, పెద్దపాలెం, చిన్నపాలెం గ్రామాల్లో కుక్కల దాడిలో సుమారు 20 వరకు గొర్రెలు, మేకలు మృతిచెందాయి. కె.జె.పేట, యరగాం గ్రామాల్లో ఆరు ఆవులు గాయపడ్డాయి. అలమాజీపేట, పెదమాలపేట గ్రామాల్లో చిన్నారులను తీవ్రంగా గాయపరిచాయి. – సరుబుజ్జిలి

రాళ్లుతేలిన రహదారి..



ఎల్.ఎన్.పేట మండలంలోని మారుమూలన ఉన్న మురగడలోవ గిరిజన గ్రామానికి వెళ్లే రోడ్డులో రాళ్లు తేలాయి. ఏబీ రోడ్డు అమృతలింగానగరం సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు నుంచి జంబాడ జంక్షన్ వరకు కంకర రోడ్డు ఉంది. వర్షాలకు రోడ్డుపై ఉన్న కంకర, మట్టి కొట్టుకుపోయింది. ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డును బాగుచేయాలని గిరిజనులు కోరుతున్నారు. – ఎల్.ఎన్.పేట

సాగునీటి కష్టాలు



ఈ చిత్రం సారవకోట మండలం బురుజువాడ సమీపంలోనిది. ప్రస్తుతం వరి పంట చివరి దశలో ఉంది. రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. పంట చేతికొచ్చే సమయంలో సాగునీరు లేకపోవడంతో సమీపంలో ఉన్న చెరువుల నుంచి ఇంజిన్లతో నీటిని పంటకు పెడుతున్నారు. జగ్గయ్యపేట, బురుజువాడ, సవరపేట, గోవర్ధనపురం తదితర గ్రామాలలో ఇదే పరిస్థితి నెలకొంది. – సారవకోట

ఎండైనా.. వానైనా..



ఎల్.ఎన్.పేట మండలంలోని లక్ష్మీనర్సుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం సైకిల్ షెడ్ లేకపోవటంతో చెట్లు కిందనే ఉంచుతున్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు సమీప గ్రామాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు సైకిళ్లపైనే వస్తున్నారు. సైకిళ్లు చెట్లు కింద ఉంచటంతో ఎండకు, వర్షానికి పాడవుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. సైకిల్ స్టాండ్ నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. – ఎల్.ఎన్.పేట

శ్రీముఖలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పాతపట్నం: నీలకంఠేశ్వర ఆలయం వద్ద సిద్ధం చేసిన ఆకాశ దీపాలు



జలుమూరు: పూజలు అందుకుంటున్న స్వామివారు

జలుమూరు: శ్రీముఖలింగం ఆలయానికి కార్తీక మాసం మొదటి శనివారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. వేకువ జామునుంచి మధ్యాహ్నం వరకు దర్శించుకున్నారు. వారాహి అమ్మవారికి కుంకుమ, ప్రత్యేక పూజలు చేపట్టారు. భీమేశ్వర, సోమేశ్వర ఆలయాలకు కూడా భక్తుల రద్దీ కొనసాగింది. జిల్లా నలుమూలలతోపాటు విజయనగరం, విశాఖపట్నం, ఒడిశా తదితర ప్రంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వంశధార నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు.

ఆలయాల్లో ఆకాశ దీపాలు ప్రారంభం

పాతపట్నం: కార్తీక మాసం ప్రారంభం నుంచి ముగింపువరకు ప్రతీరోజు సూర్యాస్తమయంలో ఆకాశ దీపాలను వెలిగించి శివునికి పూజలు నిర్వహిస్తారు. ఈ నెలలో ప్రతీ సోమవారం శివునికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. కార్తీక మాస పూజలకు ఆలయాలను ముస్తాబు చేశారు. పాతపట్నంలోని నీలకంఠేశ్వర ఆలయంలో శనివారం సూర్యాస్తమయ సమయంలో ఆకాశ దీపాలను వెలిగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బూర్జ: మండలంలోని కె.కె.రాజపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎస్.జి.ఎఫ్ అథ్లెటిక్స్ (జిల్లా స్థాయి)లో ప్రతిభ కనబర్చినట్లు హెచ్ఎం వై.మాలతి తెలిపారు. సెప్టెంబర్ 26న శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియలో జరిగిన మీట్‌లో పాల్గొని ప్రతిభ చూపారన్నారు.

విద్యార్థులను శనివారం పాఠశాల వద్ద అభినందించారు. ఈ నెల 3, 4వ తేదీల్లో శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియంలో జరగనున్న అథ్లెటిక్స్ (రాష్ట్ర స్థాయి) పోటీల్లో వి.రాధిక, కె.షమీర, జి.కావ్య, కె.లోకేశ్వరరావు, కె.వాసుదేవరావు పాల్గొంటారని హెచ్ఎం తెలిపారు.

క్యాన్సర్ బాధితురాలికి సాయం

శ్రీకాకుళం పాతబస్టాండ్: క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ మహిళకు వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.1.50 లక్షలు మంజూరైంది. జలుమూరు మండలం కరకవలస గ్రామానికి చెందిన పేరాడ సాయిరామ్ తన తల్లి అమ్మన్న క్యాన్సర్‌తో బాధపడుతోందని, ప్రభుత్వం ఆదుకోవాలని శుక్రవారం ఈదుపురం వచ్చిన సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్‌ను శనివారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తన కార్యాలయంలో సాయిరామ్‌కు అందజేశారు.

కనీస జాగ్రత్తలు పాటించకుండా..



ఆల్ ఆంధ్ర రహదారిలో ఇసుక ట్రాక్టర్

మెళియాపుట్టి: పాతపట్నం నుంచి ఆల్ ఆంధ్ర రహదారిలో రోజుకు పదుల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్లు వస్తున్నాయి. టార్పాలిన్లతో ఇసుకను కప్పి తరలించాల్సి ఉన్నా.. అవేవీపట్టనట్లు ట్రాక్టర్ల యజమానులు వ్యవహరిస్తున్నారు. చిన్న రహదారి కావడం, ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో వాహనదారుల కళ్లల్లోకి ఇసుక పడి ఇబ్బంది పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఉపాధిలో 266 పనులకు అవకాశం

- డ్వామా పీడీ సుధాకరరావు



మాట్లాడుతున్న డ్వామా పీడీ సుధాకరరావు

సారవకోట: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా భూగర్భ జలాలను పెంచేందుకు 266 పనులు చేసుకునే అవకాశం ఉందని, జాబుకార్డు ఉన్న వేతనదారులందరికీ తప్పనిసరిగా పని కల్పించాలని డ్వామా పీడీ బి.సుధాకరరావు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 16వ విడత ఉపాధి సోషల్ ఆడిట్‌కు సంబంధించి ప్రజా వేదిక నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ మండలంలో రూ.23.19 కోట్ల ఉపాధి నిధుల వినియోగంపై సోషల్ ఆడిట్ నిర్వహించామన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాలని ప్రతిపాదనలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. గ్రామాల్లో 10 మంది పనికి వెళ్తే ఆరుగురు పని చేస్తుండగా.. మరో నలుగురు గట్లపై కూర్చుంటున్నారన్నారు. ఇకనుంచి కొలతలు ఇచ్చి పని చేయాలని సూచిస్తామని, ఆ పనుల ప్రాప్తికి వేతనాలు మంజూరు చేస్తామన్నారు. ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు గ్రామాల్లో ఉపయోగపడే పనులు గుర్తించాలన్నారు. ఇదివరకు వేసవిలో మాత్రమే పనులు ఇచ్చేవారమని, ఇప్పుడు వేతనదారులు ఎప్పుడు పనులు కావాలని అడిగితే అప్పుడు పనులు ఇవ్వాలన్నారు.

అవకతవకల గుర్తింపు..

కిడిమి పంచాయతీలో గోకులం నిర్మాణం పూర్తికాకుండానే బిల్లు చెల్లించినట్లు సోషల్ ఆడిట్ సిబ్బంది గుర్తించారు. జమచక్రం పంచాయతీలో పలువురు రైతులకు ఉద్యానవనశాఖ ద్వారా మొక్కలు అందించారని, ఏ ఒక్క రైతు పొలంలోనూ మొక్కలు లేవన్నారు. దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్ మొక్కలన్నీ చనిపోయాయని చెప్పడంతో అందరూ ఆశ్చర్యానికి గురయ్యారు. అలుదు పంచాయతీలో పశువుల కోసం కట్టే గోకులం షెడ్ నిర్మాణం చేపట్టి ప్రస్తుతం కారు పెడుతున్నారని సోషల్ ఆడిట్ సిబ్బంది గుర్తించి సభ దృష్టికి తీసుకొచ్చారు. మదనాపురం పంచాయతీలో ఒకే వర్క్ ఐడీపై రెండు పనులు చేపట్టారని గుర్తించారు. బద్రి, కె.జె.పురం పంచాయతీలలో వేతనదారుల నుంచి రూ.100 వసూలు చేశారన్నారు. కోదడ్డవలస పంచాయతీలో పనులు చేసిన చోట పెట్టే నేమ్ బోర్డులలో ఒక పని చేసి, మరోక పనికి సంబంధించిన వివరాలు నమోదు చేసినట్లు గుర్తించారు. పలు పంచాయతీలలో మస్టర్లలో దిద్దుబాట్లు, పనికి వెళ్లకుండా వారి ఖాతాలకు వేతనాలు జమైనట్లు గుర్తించారు. సంబంధిత సిబ్బంది నుంచి రూ.5.40 లక్షలు రికవరీ చేసినట్లు ఏపీఓ నారాయణరావు తెలిపారు.

నైపుణ్య గణన భవిష్యత్ తరాలకు అవసరం

హిరమండలం: నైపుణ్య గణన ద్వారా భవిష్యత్ తరాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులకు నైపుణ్య గణనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నైపుణ్య గణనపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జెడ్పీటీసీ సభ్యుడు అన్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ నోడల్ అధికారి మేరా, ఈఓపీఆర్డీ గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

కొత్తూరు: మద్యాన్ని ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేస్తామని స్థానిక ఎక్సైజ్ సీఐ కిరణం మణీశ్వరి హెచ్చరించారు. కొత్తూరులో శనివారం విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే విక్రయించాలన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసే దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యాన్ని నిల్వ చేసినా.. అక్రమంగా రవాణా చేసి పట్టుబడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎమ్మార్పీ ధరలకే మద్యాన్ని విక్రయించాలి

ఆమదాలవలస: ఆమదాలవలస ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల అన్ని మద్యం దుకాణాలులో ఎమ్మార్పీ రేట్లకే మద్యాన్ని విక్రయించాలని ఆమదాలవలస ఎక్సైజ్ సీఐ సతీష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్‌దారులు ఈ విషయంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ దుకాణం వద్ద ధరల పట్టిక ప్రదర్శించాలన్నారు. ఒకరికి మూడు మద్యం బాటిళ్లు, మూడు బీర్ బాటిళ్లు మాత్రమే విక్రయిస్తామనే బోర్డు ప్రతీ షాప్ వద్ద ఉండాలన్నారు.

ఉపాధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

పాతపట్నం: ఉపాధి హామీ పనులను నాణ్యతగా చేపట్టాలని డ్వామా పీడీ బి.సుధాకర్ అన్నారు. మండలంలోని ప్రహరాజపాలెంలో రూ.5 లక్షలతో శివాలయానికి వెళ్లే సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు.

నియోజకవర్గానికి ఉపాధి హామీ పథకం కింద రూ.25 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఎంపీడీఓ చంద్రకుమారి, ఏపీఓ సురేష్, జేఈ శ్రీనివాస్, టెక్నికల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డు ఏర్పాటు



శివాలయానికి సీసీ రహదారి నిర్మాణం చేపట్టిన దృశ్యం

పాతపట్నం: మండలంలోని చిన్నలోగిడి గ్రామంలో ఉన్న లోకనాథేశ్వర ఆలయానికి(శివాలయం) రూ.80 వేలతో 40 మీటర్ల మేర శనివారం సీసీ రహదారి నిర్మాణం చేపట్టినట్లు పెద్దలోగిడి గ్రామానికి చెందిన రిటైర్డ్ పంచాయతీ సెక్రటరీ బైపోతు రాజేశ్వరరావు తెలిపారు. తన తండ్రి బైపోతు జగన్నాథరావునాయుడు జ్ఞాపకార్థం తన సొంత నిధులో రహదారి నిర్మాణం చేపట్టానన్నారు. రాజేశ్వరరావును పెద్దలోగిడి, చిన్నలోగిడి గ్రామస్తులు అభినందించారు.